## క్లుప్తంగా

### సాగునీటి కోసం వినతి



రైతుల సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: సాగునీరు అందించి రబీ పంటకు అవకాశం కల్పించాలని కోరుకొండ మండలం కోటికేశవరం రైతులు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆయనను కలిశారు. తమ గ్రామంలో సుమారు 500 ఎకరాలకు సాగు నీటి అవసరం ఉందన్నారు. కాగా ఈ విషయమై నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకుంటామని వారికి ఎమ్మెల్యే రాజా హామీ ఇచ్చారు. అలాగే అనువైన ప్రాంతంలోనే పేదలకు నివాస స్థలాలు ఇచ్చేలా చూస్తానన్నారు.

### శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు



అభిషేకాలు చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: స్థానిక శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. మఘమాసంలో మంగళవారం దశమి సందర్భంగా 188 అభిషేకాలు జరిగాయి. స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు భక్తులు నిర్వహించారు. ఈవో రామలింగ భాస్కర్ పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలపై సర్వే



పందలపాకలో సిటిజన్ ఔట్ రీచ్ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందేలా సచివాలయ అధికారులు సర్వే నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో సిటిజన్ ఔట్ రీచ్ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన లబ్ధి వారికి అందిందా లేదా అని వివరాలు సేకరిస్తూ లబ్ధిదారుల ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలోని 25,229 కుటుంబాలకు గాను 21,578 కుటుంబాల సర్వే పూర్తయిందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు.


### రిటైర్డ్ టీచర్‌కు సత్కారం



మీరాఖాసీం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా సేవలందించిన షేక్ మీరా ఖాసిం పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాయవరం చాణిక్య నర్సింహామ్ అధినేత డాక్టర్ జి. ఎస్ఎన్ రెడ్డి, పందలపాక సూరారెడ్డి నర్సింహామ్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మీరాఖాసీం, ఆషాభేగం దంపతులను సత్కరించారు. పాఠశాల హెచ్ఎం చింతా వెంకట సోమిరెడ్డి, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ సబ్బారపు పద్మావతి పాల్గొన్నారు.

### చీపురపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్



చీపురపల్లిలో మంచంపై ఉన్న వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని చీపురపల్లి సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి చికిత్స చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్, ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, ఎస్.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూపా రాణి, ఏఎన్ఎం శిరోమణి, ఆశ వర్కర్లు కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరి పువ్వుతో జీవనోపాధి

- రోడ్ల పక్కనే విక్రయం
- పలువురికి ఇదే ఆధారం

రాజానగరం: కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. బతుకుతెరువు కోసం నిత్యం ఏదో పని చేయనిదే పూటగడవని జీవితాలు ఎన్నో ఉన్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత కొన్ని రోజులు సరైన పనులు దొరకక ఇబ్బంది పడతారు. అటువంటి సమయంలో ఏదొక పని చేసుకుని, జీవనం సాగించేవారు కొందరుంటే.. మరికొందరు సీజనల్ వారీగా దొరికే కాయలు, పండ్లను అమ్ముకుంటూ జీవన ఉపాధి పొందుతుంటారు. ఆ విధంగా రహదారుల వెంబడి ముఖ్యంగా జాతీయ రహదారికి ఇరువైపులా రావులపాలెం, మోరంపూడి, లాలాచెరువు, దివాన్ చెరువు, రాజానగరం వంటి కొన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ఇటువంటి చిరువ్యాపారులు నిత్యం దర్శనమిస్తూనే ఉంటారు. వారు అమ్ముతున్న కాయ, పండ్లతో కూలీ డబ్బులు దక్కితే చాలన్నట్టుగా వారి వ్యాపారాలు సాగుతూ ఉంటాయి.

**కొబ్బరి పువ్వుల అమ్మకాలే ఉపాధి**

కోటికోటేశ్వరం, నిడదవోలు, సూరంపాలెం తదితర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కొబ్బరి పువ్వులను విక్రయిస్తూ, ఉపాధిని పొందుతున్నారు. పైప్రాంతాలకు చెందిన 10 మంది వ్యక్తులు ప్రస్తుతం జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి, నగరవాసులకు సైకిళ్లపై పెట్టుకుని ఈ కొబ్బరి పువ్వులను విక్రయిస్తున్నారు. కొబ్బరి కాయ ఒక్కింటికీ మార్కెట్‌లో రూ.15 నుంచి రూ.25 ధర పలుకుతున్న నేపథ్యంలో మూడు కొబ్బరి పువ్వులను రూ.100కు విక్రయిస్తున్నారు. ఒక్కటే కావాలంటే రూ.40 చెల్లించాలి.

**మొలకెత్తిన కాయల నుంచే పువ్వు**

కొబ్బరి పువ్వు రుచికి ఎంతో బాగుంటుంది. కోనసీమ వాసులకు ఇది సర్వసాధారణమే. ఇతర ప్రాంతాల వారికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. కొబ్బరి పువ్వులు ఎక్కువగా కొబ్బరి రాశుల్లో లభిస్తుంటాయి. కొబ్బరి తోటలు, గోడౌన్లలో రాశులుగా పోసి, నిల్వ చేసిన కొబ్బరి కాయలలో ముదిరిన వాటి నుంచి మొక్కలు వస్తుంటాయి. వాటిని ఏరితీసేస్తుంటారు. అలాగే కొన్ని ప్రాంతాలో కొబ్బరి నార్లు కట్టి మొలకలు వచ్చిన తరువాత పువ్వుల కోసం వచ్చే వారికి విక్రయిస్తుంటారు. ఆ విధంగా రైతులు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన కాయలను పూర్తిగా ఒలిచేసి, ఈ చిరువ్యాపారులు ఊరూరా తిరుగుతూ, రోడ్ల పక్కన విక్రయిస్తుంటారు.



విక్రయించేందుకు సిద్ధం చేసిన కొబ్బరి పువ్వుతో కూడిన కాయలు



కొబ్బరికాయలో ఉన్న పువ్వు, చిప్పలో మిగిలిన కొబ్బరి (ఇది పనికిరాదు)

**సైకిళ్లపై తిరుగుతూ విక్రయిస్తాం**



వ్యవసాయ పనులు లేని సమయంలో ఖాళీగా ఉండలేక, జీవనం కోసం కొబ్బరి పువ్వులను అమ్ముతుంటాం. కమతాలలో రైతుల నుంచి కొద్దిపాటి మొక్కలొచ్చిన కాయలను కొనుగోలు చేసి, వాటిని ఒలిచి, శుభ్రపరుస్తాం. ఆ తరువాత వాటిని సైకిళ్లపై పెట్టుకుని విక్రయించి, జీవనోపాధిని పొందుతాం. వీటి విక్రయాల ద్వారా రోజుకు కూలి సొమ్ములు గిట్టుబాటు అయితే చాలన్నట్టుగానే మా వ్యాపారాలుంటాయి.

– ఇనమర్తి శ్రీను, నిడదవోలు

# ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



కొలువుదీరిన అనపర్తి మార్కెట్ కమిటీ పాలకవర్గం

అనపర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మంగళవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమక్షంలో చైర్మన్‌గా కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా అడబాల వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులుగా షేక్ పీర్ సాహెబ్, గుండ ఈశ్వరరావు, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కోనాల సత్యనారాయణరెడ్డి, పోతంశెట్టి ఈశ్వరరెడ్డి, అనుసూరి సుబ్రహ్మణ్యం, గొర్రిపూడి చాలియ్య, దాసరి శరణ్య, వారా కుమారి, ఇందుగమిల్లి సత్యవతి, శిరిగిన రేవతి, సూర్యావతి, సంధ్య, సంగడాల పాపయ్యమ్మ, సూరంపూడి సుజాతలక్ష్మి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ కార్యదర్శి బి.రవికుమార్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా పాలకవర్గం కార్యదక్షతను నిరూపించుకోవాలన్నారు. ఏఎంసీ పదవులన్నీ గతంలో పురుషులకే కేటాయించగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా సాధికారకతకు పెద్ద పీట వేస్తోందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అనుసూర్తి సూర్యనారాయణ(బుజ్జి), వైస్ ఎంపీపీలు పులగం బులిరెడ్డి, కర్రి ఏసుదాసు, రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), జెడ్పీ మాజీ ప్రతిపక్షనేత సత్తి రామారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి



కోటపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో అందించే వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వేణుశ్రీలక్ష్మి కోరారు. రంగంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని కోటపాడులో నిర్వహించిన శిబిరంలో ఆమె వైద్య సేవలు అందించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు చిన్న చిన్న అనారోగ్యాలకు మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరులోనే వైద్య సేవలు పొందేలా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. గ్రామంలోని 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఎంపీహెచ్ఈఓ శంకర్, పీహెచ్‌సీ, 104 సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

# స్పర్శ కార్యక్రమంపై అవగాహన



స్పర్శ కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది

రంగంపేట: కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించి స్పర్శ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ శంకర్ కోరారు. మంగళవారం స్థానిక సచివాలయం-1 వద్ద స్పర్శ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తామని, స్పర్శలేని రాగిరంగు మచ్చలను గుర్తించే సర్వేను వేగవంతం చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శి భోనగిరి వెంకటేష్, హెచ్‌వీ కుమారి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశలు పాల్గొన్నారు.

# కులాల వారీగా జనాభా లెక్కించాలి



రంగంపేట బీసీ నాయకులతో వెంకటేశ్వరరావు

రంగంపేట: రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన రంగంపేటలో మంగళవారం జరిగిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన పది రాష్ట్రాలు బీహార్‌ను ఆదర్శంగా తీసుకుని వారి రాష్ట్రాల్లో కులాల వారీగా జనాభా లెక్కలు తీయడానికి ముందుకురావాలన్నారు. మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులాల వారీగా జనాభా లెక్కలు తీయాలని కోరారు. రంగంపేట మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా కేతా సత్తిబాబుకు నియామక పత్రం అందించారు. రాష్ట్ర కార్యదర్శి బొల్లా శ్రీనివాసు, బీసీ నాయకులు గురజారపు వీరభద్రం, గుత్తుల సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి సత్యనారాయణ, చొల్లంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన తంటికొండ వెంకన్న గ్రామోత్సవం



తంటికొండలో వేంకటేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి గ్రామోత్సవం అంబరాన్నంటింది. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామి వారిని మంగళవారం ఉదయం గరుడ వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, మ్యూజికల్ బ్యాండ్, డప్పు వాయిద్యాలు వంటి పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్‌వీ చందన, ధర్మకర్తల మండలి సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొని స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవస్థానం సిబ్బంది, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

# పాండవుల మెట్ట తీర్థానికి ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన పాండవుల మెట్ట

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో ఉన్న పాండవుల మెట్ట ఐదు రోజుల పాటు జరిగే తీర్థానికి సుందరంగా ముస్తాబైంది. బుధవారం నుంచి జరిగే ఈ తీర్థానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఏటా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తీర్థం సందర్భంగా పాండవుల మెట్టను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తీర్థానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. తీర్థం సందర్భంగా కబడ్డీ టోర్నమెంటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

# రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మధురపూడి: దోసకాయలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 66వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చూపారు. అండర్ 17 వ్యక్తిగత విభాగంలో కె.తులసి అంజలి, ఎం.వీరమణి, కె.భార్గవి, అండర్ 14 వ్యక్తిగత విభాగంలో కేఎల్‌వీ ప్రసన్న, కె.మహి, బి.లోకేశ్వరి బంగారు పతకాలు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాకు ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ కూడా వచ్చింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయులు బి.చెల్లాయమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, ఎం.శ్యామలాదేవి తదితరులు అభినందించారు.

### లక్ష చామంతులతో బాబాకు పూజలు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో కొలువైన ఉన్న షిర్డీ సాయిబాబాకు మంగళవారం లక్ష చామంతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 23 వార్షికోత్సవం సందర్భంగా మల్లిడి వెంకటరామారెడ్డి, సీత దంపతులతో అర్చకులు యలమంచిలి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, రుద్రాభిషేకం, హోమాలు, బాబా హారతులు నిర్వహించారు. అనంతరం మల్లిడి రామమూర్తి పెద్ద, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

### బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మంగళవారం తెలిపారు. కంప్యూటర్ కోర్సుకు ఇంటర్, ఇతర కోర్సులకు పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 45 రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణలో మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందజేస్తామని, అనంతరం ఉత్తీర్ణత పత్రాలు ప్రదానం చేస్తామన్నారు. కంప్యూటర్ కోర్సులో చేరేవారు 81256 86494, టైలరింగ్ బ్యూటిషన్ కోర్సులకు 95731 11923 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

### వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తబృందం ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండోరోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, శేషవాహన సేవ నిర్వహించారు. గ్రామవీధులలో రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### 3న చైతన్యయాత్ర

కడియం: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 3న జరిగే బహుజన రాజ్యాధికార చైతన్యయాత్రను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ కుమార్, జిల్లా ఇన్‌చార్జి, ప్రముఖ న్యాయవాది పరమట గణేశ్వరరావు పిలుపునిచ్చారు. కడియం అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు దమ్ము కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరమట గణేశ్వరరావు మాట్లాడుతూ 3వ తేదీన ధవళేశ్వరం నుంచి వేమగిరి, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, వీరవరం మీదుగా చైతన్య యాత్ర సాగుతుందన్నారు. కడియంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రసంగం ఉంటుందన్నారు. బీఎస్పీ రూరల్ అధ్యక్షుడు గెడ్డం ప్రసాద్, రూరల్ ఇన్‌చార్జి పల్లి అబ్బులు, దోనపాటి వందనం, కనికెళ్ల బుల్లియ్య పాల్గొన్నారు.